క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ



సూర్యభగవానుడికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రథసప్తమిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శనివారం సూర్యోపాసన సేవ జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై సూర్యభగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం వేదికపై సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించారు. అనంతరం ఉభయదాతలను ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

ఓబీసీ మోర్చా కార్యదర్శిగా అన్నపూర్ణ



అన్నపూర్ణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): బీజేపీ ఎన్టీఆర్ జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శిగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన అన్నపూర్ణ నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తనతోపాటు ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా డి.సుబ్రహ్మణ్యాన్ని నియమించినట్లు బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అవ్వారు శ్రీనివాసరావునియామక పత్రాన్ని అందజేసినట్లు పేర్కొన్నారు.

అలరించిన హరికథా గానం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై శనివారం ప్రదర్శించిన హరికథా గానం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై ఏలూరుకు చెందిన సప్పా భారతి హరికథా గానాన్ని ఆలపించారు. భారతికి పెడన అగ్రహారానికి చెందిన దశిక రమేష్, ఏలూరుకు చెందిన మనోహర్ల తబల సహకారాన్ని అందజేశారు. హరికథా గానం చేసిన భారతికి ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

లక్ష్యసాధనతో ముందుకు సాగాలి



హరికథా గానం చేస్తున్న భారతి బృందం

వన్టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు లక్ష్యసాధనతో ముందుకు సాగాలని విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ టుటోరియల్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు దేవినేని కిషోర్‌కుమార్ అన్నారు. విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ వన్టౌన్, భవానీపురం శాఖ ఆధ్వర్యంలో పశ్చిమనియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రైవేట్ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులను కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన దేవినేని కిషోర్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు శ్రమించే తత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. కష్టపడి ముందుకు సాగితే అద్భుతమైన విజయాలను అందుకోవచ్చన్నారు. కార్యక్రమానికి దొంతులూరి రాజు డేవిడ్ అధ్యక్షత వహించారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు విద్యార్థులకు తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఖాదర్‌బాషా, జీ సాంబశివరావు, బీకే శిరీషకుమారి పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు దొంగతనం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వాకింగ్‌కు వెళ్లి వస్తున్న మహిళ మెడలో గొలుసు దొంగతనానికి పాల్పడిన ఘటన భవానీపురం పోలీసుస్టేషన్ పరిధిలోని నాలుగు స్తంభాల సెంటర్‌లో చోటు చేసుకుంది. నాలుగు స్తంభాల సెంటర్‌కు చెందిన దేసు మాణిక్యమ్మ శనివారం ఉదయం వాకింగ్‌కు వెళ్లింది. తిరిగి ఇంటికి వెళ్తుండగా సందు చివర బడ్డీ కొట్టు వద్దకు కుమారి వచ్చే సరికి ఆమె మెడలో బంగారు నాను తాడును లాగినట్లు అనిపించింది. వెనక్కు తిరిగి చూసే సరికి బండిపై మంకీ క్యాప్ పెట్టుకున్న వ్యక్తి బండి ఎక్కి అక్కడ నుంచి పారిపోయాడు. దీనిపై భవానీపురం పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. తన మెడలో గొలుసు (నాను బాడు + సూత్రాలు కలిపి) ఏడు కాసులు ఉంటుందని, లాగిన సమయంలో నానుతాడు తెగిపోయి కొంత భాగం కింద పడిపోయిందని, మరికొంత భాగం అతని చేతిలో ఉందని ఫిర్యాదులో పేర్కొంది. రెండు బైక్‌లపై ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లు పోలీసులకు తెలిపింది. భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దమ్మ్ముంటే నగరాభివృద్ధిపై చర్చకు రావాలి

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేసిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నారా లోకేష్‌కు దమ్ముంటే నగరాభివృద్ధిపై చర్చకు రావాలని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రాష్ట్రాభివృద్ధిపై నోటికొచ్చినట్లు మాట్లాడుతున్న లోకేష్ చెప్పిన అంశాల్లో ఏ ఒక్కటీ నిజం లేదన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 52వ డివిజన్, 115వ సచివాలయం పరిధిలో శనివారం పర్యటించారు. మల్లికార్జునపేటలోని పలు కొండ ప్రాంతాల్లో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి తంగెళ్ల రామచంద్రరావు నాయకత్వంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే స్థానిక సమస్యలపై ఆరా తీసి, వెంటనే అధికారులతో చర్చించి, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కొండ ప్రాంతంలో కొన్ని మెట్లు దెబ్బతిన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాగే డ్రైనేజీ సమస్యలు అక్కడక్కడా ఉన్నాయన్నారు. వాటిని త్వరితగతిన పరిష్కరించి అభివృద్ధి చేస్తామన్నారు. అమరావతిలో ధనికులు మాత్రమే ఉండాలనే లక్ష్యంతో పేదల సొంత ఇంటి కలను అడ్డుకున్న వ్యక్తి చంద్రబాబు అని ఆరోపించారు. రాష్ట్రంలో అశాంతిని సృష్టించడమే చంద్రబాబు లక్ష్యమన్నారు. అందులో భాగంగానే కందుకూరు, గుంటూరుల్లో ఆ విధమైన సంఘటనలకు కారణమయ్యారన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై దుమ్మెత్తిపోయడమే పచ్చ పత్రికల లక్ష్యమన్నారు. వాళ్లందరూ ఎన్ని కుట్రలు చేసినా ప్రజాబలం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్కలంగా ఉందన్నారు. లోకేష్ పాదయాత్ర పేరుతో నోటికొచ్చినట్లు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. లోకేష్ పాదయాత్ర చేపడితే ఆఖరకు నందమూరి కుటుంబానికి చెందిన వ్యక్తికే ఏ విధమైన పరిస్థితి వచ్చిందో అందరికీ తెలిసిందేనన్నారు. 2014 నుంచి 2019 వరకూ జరిగిన అభివృద్ధి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత జరిగిన ప్రగతిపై చర్చకు రావాలన్నారు. రాష్ట్రం వరకూ కాదని కనీసం విజయవాడ అభివృద్ధిపై చర్చకు రావాలన్నారు. ఆఖరకు పోలీసులపై కూడా అచ్చెంనాయుడు దిగజారి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు తంగెళ్ల రామచంద్రరావు, సచివాలయం, రెవెన్యూ, పోలీసు, నగరపాలకసంస్థ అధికారులు పాల్గొన్నారు.

లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా ఉచితంగా న్యాయ సేవలు

ఏపీ హైకోర్టు జస్టిస్ డాక్టర్ వీఆర్‌కే కృపాసాగర్



మాట్లాడుతున్న హైకోర్ట్ జడ్జి జస్టిస్ వి.ఆర్‌కె. కృపాసాగర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): న్యాయ సహాయం అవసరమైన వారు జిల్లా న్యాయ సేవల అధికారులను సంప్రదించవచ్చని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జస్టిస్ డాక్టర్ వీఆర్‌కే కృపాసాగర్ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కొత్తగా ఎంపికైన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. శనివారం శిక్షణ కార్యక్రమాన్ని హైకోర్టు జస్టిస్ డాక్టర్ సీఆర్‌కే కృపాకర్ సాగర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రయల్ ఖైదీలు, దోషిగా ఉన్న ఖైదీల బెయిల్ దరఖాస్తులు, ట్రయల్ నిర్వహించడం, అప్పీళ్లను నిర్వహించడం మొదలైన వాటి ప్రయోజనాల కోసం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సిస్టమ్ ప్రవేశపెట్టినట్లు చెప్పారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సేవలు పూర్తిగా ఉచితమని పేర్కొన్నారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో పని చేస్తుందన్నారు. ఖైదీలకు చట్టపరమైన సహాయం, సలహాలు అందించాలన్నారు. న్యాయపరమైన అంశాలలో సలహాలు, సూచనలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మెంబర్ సెక్రటరీ ఎం.బబిత, నూతనంగా ఎంపికైన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

● నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన బిరుదుకోట దుర్గావల్లి దంపతులు రూ.1.07 లక్షల విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాతలకు అమ్మవారి చిత్రపటాన్ని ఆలయ అధికారి అందజేశారు.

- ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ)

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రమణమూర్తి



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

విజయవాడ స్పోర్ట్స్: మత్తు పదార్థాలు జీవితాన్ని చిత్తు చేస్తాయని, మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రమణమూర్తి సూచించారు. 'సే నో టు డ్రగ్స్' కార్యక్రమంలో భాగంగా క్రీస్తురాజుపురంలోని క్రైస్ట్ ద కింగ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. లా అండ్ ఆర్డర్, టాస్క్‌ఫోర్స్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రమణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు వారి తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా యువత పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ సరఫరా ముఠాను ఆట కట్టించేందుకు పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటోందన్నారు. అనంతరం విద్యార్థులు 'సే నో టు డ్రగ్స్' ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో మాచవరం సీఐ బి.గుణరాము, ఎస్ఈబీ సీఐ స్వామినాథం పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతగా విద్యార్థులకు ఆర్వో ప్లాంట్



ఆర్వో ప్లాంట్ ప్రారంభించిన సీజీఎం నవీన్ చంద్ర ఝూ

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యార్థులకు ఆరోగ్యవంతమైన తాగునీటిని అందించేందుకు ఆర్వో ప్లాంట్‌ను బహూకరించామని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అమరావతి సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ నవీన్ చంద్ర ఝూ పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్య అకాడమీ హైస్కూల్‌కు విజయవాడ ఎస్‌బీఐ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) కింద రూ.4 లక్షలు విలువ చేసే ఆర్వో ప్లాంట్, గ్రీన్ చాక్ బోర్డ్‌లను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వైపు తమ ఖాతాదారులకు ఉత్తమమైన సేవలు అందిస్తూనే మరో వైపు ప్రతి ఏడాదీ తమ బ్యాంక్ లాభాల్లో ఒక శాతం వివిధ సేవా కార్యక్రమాలకు వినియోగిస్తుందని తెలిపారు. ఎస్‌బీఐ డీజీఎం రంగరాజన్ మాట్లాడుతూ, బ్యాంక్ జనరల్ మేనేజర్లు కృష్ణ శర్మ, ఓం నారాయణ శర్మ, కె గుండూరావు, మంజు శర్మ, ఆశా శర్మ, కోమలి, అరుణా రావు, అంబేడ్కర్ యువజన సంఘం కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ విజేత కేబీఎన్ కాలేజీ జట్టు



విజేతగా నిలిచిన కేబీఎన్ కళాశాలల మహిళా జట్టు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల హ్యాండ్‌బాల్ (మహిళ) టోర్నమెంట్ విజేతగా కేబీఎన్ కళాశాల నిలిచింది. ద్వితీయ స్థానంలో స్టెల్లా మహిళా కళాశాల, తృతీయ స్థానంలో వికాస్ కళాశాలలు వరుసగా విజయాలను అందుకున్నాయి. కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల మహిళా హ్యాండ్‌బాల్ టోర్నమెంట్ కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకూ ఏకధాటిగా పోటీలు కొనసాగాయి. రాత్రి జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు బహుమతులను అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ హేమచంద్రరావు పాల్గొన్నారు.

క్రీడలతో ధైర్యసాహసాలు

క్రీడలతో యువతకు ధైర్యసాహసాలు సొంతమవుతాయని విజయవాడ అడిషనల్ పోలీస్ కమిషనర్ కే శ్రీనివాసరావు పేర్కొన్నారు. కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో శనివారం ఉదయం జరిగిన ప్రారంభోత్సవం సభకు అడిషనల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తానూ ఇదే కళాశాలలో చదువుకుని ఈ స్థాయికి చేరుకున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువుకే కాకుండా క్రీడా సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి విగ్రహ ప్రతిష్ట



శ్రీవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యేలు వెలంపల్లి, మల్లాది, మేయర్ భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో అయ్యప్ప స్వామి గుడి ఎదురుగాగల వాసవి ఫార్మా మార్కెట్ కాంప్లెక్స్ ప్రాంగణంలో నిర్మించిన ఉత్తరాభిముఖ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారు, గరుత్మంత, జీవధ్వజ, విమాన శిఖర ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. రథసప్తమి పర్వదినాన వైఖానస ఆగమోక్త ప్రకారం వైదిక పూజలు, పండితోత్తముల వేద పారాయణతో సన్నాయి మేళతాళాలతో 'ఓం నమో వేంకటేశాయ' అనే దివ్య నామస్మరణతో గొల్లపూడి గ్రామం మారుమోగింది. అనంతరం వేంకటేశ్వర స్వామి శాంతి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమానికి పశ్చిమ, సెంట్రల్ ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పల్లపోతు మురళీకృష్ణ(కొండపల్లి బుజ్జి), ఆలయ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి దేవతి నాగేశ్వరరావు, దేవాలయ నిర్మాణ దాత నీలి సతీష్‌కుమార్, జొన్నలగడ్డ శివప్రసాద్, నీలిశెట్టి చెన్నకేశవులు, సత్యనారాయణ, సురేష్, పొత్తూరి మణికంఠ, ఆదిశేష గుప్తా, శ్రీనివాస్, లక్ష్మణరావు, స్వరూప్‌కుమార్, శ్రీనివాసగుప్తా, శివాజీ, వైకుంఠం, వేణు పాల్గొన్నారు.

ఆదిత్యునికి క్షీరాభిషేకాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని ఏకైక సూర్యమందిరమైన వన్‌టౌన్‌లోని శ్రీ కృష్ణ ప్రార్థనా మందిరంలో వేంచేసి ఉన్న సూర్యభగవానుడికి శనివారం ప్రత్యే పూజలు నిర్వహించారు. రథసప్తమిని పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. నగరంలో ఎక్కడా సూర్యనారాయణమూర్తి ఆలయం లేకపోవడంతో శ్రీ కృష్ణ ప్రార్థనా మందిరం ప్రాంగణంలోనే కొలువై ఉన్న స్వామి వారికి పూజలు నిర్వహించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా గోక్షీరంతో తయారు చేసిన పొంగలిని ప్రసాదంగా భక్తులకు అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు స్వామిని దర్శించుకుని అభిషేకాలను నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గోకవరపు మురళీకృష్ణ, గుడిపాటి పాపారావులు పర్యవేక్షించారు.

ప్రత్యేక అభిషేకాలు

నగరంలోని పురాతన ఆలయమైన భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో రథసప్తమి వేడుకలను పురస్కరించుకొని శనివారం పలు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి హేమలతాదేవి పర్యవేక్షించారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

భవానీపురం(విజయవాడపశ్చిమ): రథసప్తమిని పురస్కరించుకుని గొల్లపూడి పరిధిలోని మహాత్మా గాంధీ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్‌లోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శనివారం రాత్రి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి హాజరయ్యారు. కాంప్లెక్స్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి నాగేశ్వరరావు, కాసుల వెంకట నారాయణ, ట్రెజరర్ నంబూరు సాంబశివరావు, ఉపాధ్యక్షులు వెలగపూడి శంకరబాబు, అన్నవరపు పార్థసారథి, కార్యదర్శి బచ్చు వెంకట రమేష్, పీఎస్ఎల్ఎన్ వరప్రసాద్ పాల్గొన్నారు.

సాయిబాబా మందిరంలో

భవానీపురం హౌసింగ్ బోర్డ్‌కాలనీలోగల సంకల్ప సిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో సకల జీవకోటి మనుగడకు మూలాధారమైన సూర్యభగవానునికి పాలు పొంగలి సమర్పించి తమ అభీష్టం నెరవేరాలని భక్తులు కోరుకున్నారు. ఆలయ పాలక మండలి అధ్యక్షుడు బూర్లె వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు మోటుమర్రి సుబ్బారావు, ప్రసాద్, యెనిగళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

ఆది దేవా నమస్తుభ్యం..



శివరామకృష్ణ క్షేత్రంలో సూర్యారాధన చేస్తున్న రుత్వికులు



సూర్య నమస్కారాలను చేస్తున్న విద్యార్థులు

విజయవాడ కల్చరల్: రథసప్తమి సందర్భంగా నగరంలోని పలు ఆలయాల్లో శనివారం భక్తులతో కిటకిట లాడాయి. అర్చక స్వాములు సూర్యారాధన, సూర్యనమస్కారాలు, ఆదిత్యహృదయ పఠనం, అరుణ పారాయణం నిర్వహించారు. భక్తులు ఆది దేవా నమస్తుభ్యం.. అంటూ స్వామి వారిని దర్శించుకున్నారు.

శివరామకృష్ణ క్షేత్రంలో..

దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో శనివారం రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. సూర్యయంత్రానికి పూజలు, నవావరణ పూజ. వేదపారాయణ, సూర్యహవనం నిర్వహించారు. ఆలయ ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ పాల్గొన్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో..

తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నగరంలోని కృష్ణలంక, సింగ్‌నగర్ పంజాసెంటర్‌లోని పాఠశాలలో ప్రత్యేక అవగాహనా సదస్సులను నిర్వహించారు. విద్యార్థులు సూర్యనమస్కారాలను నిర్వహించారు. కార్యక్రమంలో హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రోగామ్ కన్వీనర్ సీవీకే ప్రసాద్, వివిధ పాఠశాలల అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

● లబ్బీపేట శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు నిర్వహించారు.

ఘనంగా రథసప్తమి ఉత్సవం



శేషవాహనంపై ఊరేగుతున్న స్వామి

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): వన్‌టౌన్ బ్రాహ్మణ వీధిలోని పురాతన ఆలయమైన వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రథసప్తమి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి ఉభయదేవరులతో కలిసి ఏడు వాహనాల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగే విధంగా శ్రీవారు వన్‌టౌన్‌లోని ఆలయంలోనూ ఏడు వాహనాలను అధిరోహించి భక్తులను తన్మయుల్ని చేశారు. ఉదయం భూసమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు శాస్త్రోక్తంగా తిరుమంజన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సర్వాభరణ భూషితుడైన స్వామిని తొలుత సూర్యప్రభ వాహనంపై అధిష్టింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో స్వామిని ఊరేగించారు. అనంతరం శేషవాహనంపై స్వామిని అధిష్టింపజేసి ఊరేగించారు. అలాగే హనుమత్, గరుడవాహలను ఉత్సవమూర్తులను అధిష్టింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం చుట్టూ స్వామి వారిని ఊరేగించారు. అనంతరం గజ, పుల్ల పల్లకీ వాహనాలపై స్వామి వారు ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామి ఊరేగారు. కార్యనిర్వహణాధికారి హరిగోపీనాథ్‌బాబు పర్యవేక్షించారు. కార్యక్రమంలో మాజీ పాలకవర్గ సభ్యుడు గర్రె సురేష్ పాల్గొన్నారు.

సప్త అశ్వాలపై శ్రీవారి ఊరేగింపు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ పద్మావతి గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం రథసప్తమి వేడుకలను నిర్వహించారు. ఉదయం స్వామి ఉత్సవమూర్తికి ఆలయ అర్చకులు వినుకొండ రామరత్నమాచార్యులు పంచామృత అభిషేకాలు, విశేష అర్చనలు నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చారు. అనంతరం ఇరు దేవేరులతో స్వామి సప్త అశ్వాలపై కొలువుదీరి చిట్టినగర్ పుర వీధుల్లో విహరించారు. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు లింగిపిల్లి అప్పారావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, మజ్జి శ్రీనివాసరావు, బెవర సూర్యనారాయణ పాల్గొన్నారు.

కొండ ప్రాంతంలో అభివృద్ధి పనులకు శ్రీకారం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రత్నకుమారి

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం 44వ డివిజన్ పరిధిలోని నాలుగు స్తంభాల సెంటర్ కొండ ప్రాంతంలో నాగేంద్ర స్వామి గుడి వద్ద అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి శనివారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాగేంద్ర స్వామి గుడి వద్ద మెట్ల పక్కన ఉన్న గోడను వంద మీటర్ల ఎత్తుకు పెంచడం, అలాగే 20 మీటర్ల రోడ్డు నిర్మాణానికి పూజ చేసి పనులను ప్రారంభించామన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో కొండ ప్రాంతవాసులు తమ సమస్యలను పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు దృష్టికి తీసుకురాగా సాధ్యమైనంత వరకు వాటిని అక్కడిక్కడే పరిష్కరిస్తున్నారని చెప్పారు. స్థానిక యద్దనపూడివారి వీధి గత కొన్నేళ్లుగా అధ్వానంగా ఉన్న నేపథ్యంలో రూ.40 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు వేయించిన ఘనత వెలంపల్లికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మైలవరపు దుర్గారావు, డివిజన్ నాయకులు వీరంకి సత్యనారాయణ, సీతారామయ్య, రాము, రమణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందరికీ అందాలి

లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ



మాట్లాడుతున్న జయప్రకాష్ నారాయణ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): వివిధ పోటీ పరీక్షల పేరుతో విద్యార్థులను ఒత్తిడి గురిచేయడం సరికాదని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ పేర్కొన్నారు. శనివారం రాత్రి సిద్ధార్థ ఆడిటోరియంలో సిద్ధార్థ అకాడమీ, వికాస విద్యా సంస్థ సంయుక్తంగా నాణ్యతకు నోచుకోని చదువులెందుకు? అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు చదలవాడ నాగేశ్వరరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో జయప్రకాష్ నారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లల చదువు కోసం ప్రతి కుటుంబం అధికంగా డబ్బును ఖర్చు చేస్తోందన్నారు. అందుకు కులం, మతం, ప్రాంతం భేదం లేదన్నారు. తమ పిల్లల బాగు కోసం ప్రాణాలైన ఇస్తామనే విధంగా మన దేశంలో తల్లిదండ్రులకున్న భావనలు ప్రపంచంలో ఎక్కడా లేవన్నారు. పాఠశాల విద్య కోసం కేంద్రం ప్రభుత్వం వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోందన్నారు. తెలంగాణాలో మనబడి, ఆంధ్రప్రదేశ్‌లో అమ్మ ఒడి, నాడు-నేడు పథకాల ద్వారా పాఠశాల స్థాయి విద్యకు అధికంగా నిధులు ఖర్చు చేస్తున్నారన్నారని తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అడిగిన ప్రశ్నలకు జయప్రకాష్ నారాయణ సమాధానమిచ్చారు.

వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మద్యానికి బానిసై వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు కేఎల్‌రావునగర్ వీఎంసీ కాలనీకి చెందిన మొదుగు లలిత కుమారికి జీ కొండూరు మండలం వెలటూరుకు చెందిన జాన్‌తో వివాహం జరిపించారు. ఇద్దరు సంతానం. జాన్ భార్యను తరచూ కొడుతూ వేధింపులకు గురి చేయసాగాడు. లలితకుమారి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.